గుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన

స్వామివారికి లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు

యాదగిరిగుట్ట, ఏప్రిల్19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో శుక్రవారం ఏకాదశి పురస్కరించుకొని స్వామి, అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అర్చకబృందం, వేద పండితులు స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో వివిధ రకాల పూలతో లక్షపుష్పార్చన పూజలు చేశారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవంలో అత్యంత వైభవంగా సాగింది. యాదగిరిగుట్ట అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా రుద్రహవనం, చండీ హవనం జరిపారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 15,79,807 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి సన్మానం


డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మదర్‌డెయిరీ డైరెక్టర్ రాంరెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 19 : జాతీయ స్థాయిలో ఉత్తమ చైర్మన్ అవార్డు అందుకున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని మండల కేంద్రంలో శుక్రవారం మదర్‌డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపగాని బాలమణియాదగిరిగౌడ్, జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, ఎడ్ల బాలలక్ష్మి, డొంకెన మహేందర్‌గౌడ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, కటకం స్వామి, ఠాకూర్ భగత్ సింగ్ పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన కోసం సైకిల్ యాత్ర

సైకిల్ యాత్ర చేస్తున్న లిట్టన్ నమ సిట్రో

ఆలేరురూరల్, ఏప్రిల్ 19 : నీటి పొదుపు పాటించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటాలని ప్రచారం చేస్తూ అస్సాం కు చెందిన లిట్టన్ నమ సిట్రో చేపట్టిన సైకిల్‌యాత్ర శుక్రవారం మండలంలోని కొలనుపాకకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్సాం నుంచి కన్యాకుమారి వరకు తలపెట్టిన జల, పర్యావరణ సైకిల్ యాత్ర ఐదు నెలల క్రితం ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టానని, ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదని పేర్కొన్నారు.

వైభవంగా భైరవపురి ఆలయ శంకుస్థాపన

మగ్దూంపల్లి గ్రామంలో భైరవపురి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతి

బీబీనగర్, ఏప్రిల్ 19 : మండలంలోని మగ్ధూంపల్లి గ్రామంలో భైరవపురి దేవాలయ నిర్మానానికి శుక్రవారం కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు సిద్దేశ్వరానంద భారతి, శ్రీ శక్తి పీఠం మాతాజీ రమ్యానంద భారతి ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ స్వర్ణాకర్షణ భైరవ, మహాలక్ష్మి కుబేర, వారాహి, మాతంగి దేవతలతో మహా దివ్య క్షేత్రంగా ఆలయ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. సిద్దేశ్వరానంద భారతి మాట్లాడుతూ భైరవపురి దేవాలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక చింతనతో, ధ్యానం చేసుకోవడానికి అనుకూలమైన క్షేత్రంగా ఉంటుందన్నారు.

పీఠం పురోహితులు మాచవోలు రమేశ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఠం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్, సెక్రటరి మునిపల్లె శ్రీనివాస్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, మాతాజీ అద్వైతానంద, గ్రామ సర్పంచ్ పిష్క లక్ష్మీ లక్ష్మీనారాయణ, ఆర్‌డీఓ అమరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, సిబ్బంది

వలిగొండ, ఏప్రిల్19: మండలంలోని సంగెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రం-1లో శుక్రవారం చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అసైన్‌మెంట్ యాక్టివిటీస్‌లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు సీడీపీఓ శైలజ ప్రోగ్రెస్ కార్డులను అందించారు. సూపర్‌వైజర్ ధనమ్మ, టీచర్ ప్రేమలత పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రామన్నపేట ప్రాజెక్ట్ ఆఫీసర్ సమీర, సూపర్‌వైజర్ శోభ, అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, ఎండీ రూహిన్ సుల్తానా, కె.ఆయిలమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భ్రమరాంభిక స్వామి విగ్రహ ప్రతిష్ఠ

బొమ్మలరామారం, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలో కురుమ యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయాల్లో శుక్రవారం భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి, కామరాతి బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. అనంతరం హోమం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కురుమ యాదవ సంఘం నాయకులు గూదె బాలనర్సింహ, పూలపల్లి రామకృష్ణ, మల్లెబోయిన శ్రీనివాస్, బైరబోయిన మల్లేశ్, రాజేశ్ పైలెట్, రాజు, బీరుమల్లయ్య, రఘు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 19 : సంక్షేమ హాస్టళ్లలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. శోభారాణి అధికారులకు సూచించారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో సంక్షేమ హాస్టళ్ల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జరిగిన ఘటనలో విద్యార్థులు అస్వస్థతకు గురై విద్యార్థి చనిపోవడం బాధాకరమన్నారు. ప్రతి హాస్టల్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి రోజు హాస్టల్‌కు సంబంధించిన కార్యాచరణల ఫొటోలను ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు, పారిశుధ్యం, స్టడీ అవర్స్‌కు సంబంధించిన ఫొటోలను అందించాలన్నారు. వార్డెన్లు హాస్టల్లోనే ఉండి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆరోగ్య చార్ట్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 23న తల్లితండ్రుల సమావేశాలు నిర్వహించి విద్యా, వైద్యం, పారిశుధ్యంపై వివరించాలన్నారు.

స్టాక్ రిజిస్టర్‌ను నిర్వహించడంతో పాటు ప్రతి నెల వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ అధికారులు ప్రతి శుక్రవారం హాస్టల్‌ను పర్యవేక్షించి పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. అనంతరం గురుకుల విద్యార్థి మృతికి సంతాప సూచికగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి వై, పాపారావు, గ్రామీణాభివృద్ధి అధికారి కృష్ణన్, జిల్లా విద్యా శాఖ అధికారి కె. నారాయణరెడ్డి, జిల్లా కేంద్ర వైద్యశాల పర్యవేక్షణాధికారి చిన్నానాయక్, సంక్షేమశాఖల అధికారులు జైపాల్‌రెడ్డి, పి, యాదయ్య, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ రజిని, మహాత్మాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా కన్వీనర్ పి. వెంకటేశ్వర్‌రెడ్డి, హాస్టళ్ల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

● డీఆర్‌డీఏ పీడీ శ్రీకృష్ణణ్

యాదగిరిగుట్ట: గౌరాయిపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీకృష్ణన్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 19 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీకృష్ణణ్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబెట్టి, తాలు, చెత్త, మట్టి పెడ్డలు లేకుండా శుభ్రం చేసి తీసుకు రావాలన్నారు. తేమ శాతాన్ని చూసిన తర్వాతే రైతుల ధాన్యానికి టోకెన్ ఇవ్వాలని వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఈఓ ప్రణయ్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం

కూరెళ్లలో ఆలయాల అభివృద్ధి కోసం విరాళం అందజేస్తున్న దాత పరమేశ్వర్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 19 : మండలంలోని కూరెళ్ల గ్రామంలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. గ్రామానికి చెందిన గూడా పరమేశ్వర్, రూ. 2లక్షలు, దోర్నాల నరసింహారెడ్డి,మంజుల దంపతులు రూ.లక్ష, గూడ జగదీశ్వర్ రూ.లక్ష, ఇరుకుల శ్రీనివాస్ రూ.51వేలు అందించారు.

కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు మోతె యాదగిరిరెడ్డి, సలహాదారులు బాషబోయిన ఉప్పలయ్య, సభ్యులు శ్రీనివాస్, స్వామి, రమేశ్, సత్యనారాయణ, రాములు, ఎలయ్య పాల్గొన్నారు.

21న వాసవీ నిత్యాన్నదాన సత్రం ప్రారంభం

● కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు

మాట్లాడుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు అయిత రాములు, ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : భువనగిరి మండల పరిధిలోని సురేంద్రపురి సమీపంలో నిర్మించిన వాసవీ నిత్యాన్నదాన సత్రాన్ని ఈ నెల 21న ప్రారంభించడంతో పాటు సత్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టనున్నట్లు వాసవీ నిత్యాన్నదాన సత్రం, వృద్ధాశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిత రాములు, ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సత్రంలో వివిధ పూజలు ప్రారంభమయ్యాయని, ఈ నెల 21వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ట్రస్ట్ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠను ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం జరిపిస్తామన్నారు. సాయంత్రం ట్రస్ట్ భవనం ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో అధునాతన సౌకర్యాలతో ట్రస్ట్ భవనం నిర్మించినట్లు చెప్పారు. 100 గదులు, 20 సూట్లు, కాన్ఫరెన్స్‌హాల్ అందుబాటులోకి తెచ్చామన్నారు. హాల్‌లో ఒకేసారి 360 మంది కలిసి భోజనం చేసే సౌకర్యం ఉందని, త్వరలోనే ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. సమావేశంలో ట్రస్ట్ కోశాధికారి చీల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మంచాల ప్రభాకర్, సహాయ కార్యదర్శులు సంబు పాండయ్య, అయిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొలనుపాకలో పోలీస్ కవాతు

కొలనుపాకలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆలేరురూరల్, ఏప్రిల్ 19 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని కొలనుపాకలో కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా నిర్భయంగా ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆలేరు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

బీఆర్ఎస్ ప్రచార రథానికి పూజలు

ప్రచార రథాన్ని జెండాఊపి ప్రారంభిస్తున్న ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 19 : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించే బీఆర్ఎస్ ప్రచార రథానికి శుక్రవారం ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వైకుంఠ ద్వారం వద్ద ప్రచార రథానికి పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ భారీ మెజార్టీతో గెలువాలని స్వామివారిని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, కార్యదర్శి అంకం నర్సింహ, రైతుబంధు సమితి డైరెక్టర్ మిట్ట వెంకటయ్య, జిల్లా నాయకులు ఆరె యాదగిరి, బీఆర్ఎస్ పట్టణ నాయకులు పాండవుల భాస్కర్, వీరేశం, ఆరె శ్రీధర్, యాకుబ్, ముక్కర్ల సతీశ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయ కమిటీ ఎన్నిక

రాజాపేట, ఏప్రిల్ 19 : మండలంలోని పన్నెండు పడుగల వేంకటేశ్వరాలయ కమిటీని శుక్రవారం ఆలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాపోలు విశ్వాస్‌రెడ్డి, అధ్యక్షుడిగా పాండాల శివకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చెక్కిల శంకర్, ఉపాధ్యక్షులుగా రాములునాయక్, ఎడ్ల స్వాతిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాపోలు అమరేందర్‌రెడ్డి, గుంటి అశోక్, కోశాధికారిగా మొలుగు సోమలింగంగుప్తా, సంయుక్త కార్యదర్శులుగా రాపోలు పుండరీకరెడ్డి, మేక ఐలయ్య, జన్నెపల్లి రవీందర్‌రెడ్డి, గుంటి బీరప్పతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'క్యామ మల్లేశంను భారీ మెజార్టీతో గెలిపించాలి'

ఆలేరురూరల్, ఏప్రిల్ 19 : భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశంను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గుండ్లగూడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 100 రోజులు దాటినా హామీలను అమలు చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు గుగులోతు రాజునాయక్, కేతావత్ సుందర్‌నాయక్, ఆలేటి నాగార్జున పాల్గొన్నారు.

నల్ల బెల్లం పట్టివేత

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్19: మండలంలోని గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించి నాటు సారా, బెల్లం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొర్ర తండా, డాకు తండా, సీత్యాతండా, రాధానగర్ తండా, పొర్లగడ్డ తండా, ఆంగోతు తండాలో రామన్న పేట, మోత్కూర్, భువనగిరి, ఆలేరు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 68 లీటర్ల నాటు సారా, 35 కిలోల బెల్లం, 2200 లీటర్ల వాష్‌ను పట్టుకున్నారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక సాయం

రామన్నపేట, ఏప్రిల్19: మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన వంగాల రాజు ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 50వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు గంగుల రాజిరెడ్డి, మందడి రవీందర్‌రెడ్డి, పున్న జగన్‌మోహన్, బత్తుల కృష్ణగౌడ్, పూస బాలనర్సయ్య, ఎంపీటీసీలు ఎండీ రేహాన్, వనం హర్షిణి, మడూరి జ్యోతి, పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దీన్, ఎండీ అక్రం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

భూదాన్ పోచంపల్లి , ఏప్రిల్ 19 : పట్టణ కేంద్రంలోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి, పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కడవేరు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు భోగ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీతా కృష్ణ, సహాయ కార్యదర్శి ముసునూరి యాదగిరి, కోశాధికారి దోర్నాల కరుణాకర్, ధర్మకర్తలు మిరియాల వెంకటేశ్, రవ్వ లక్ష్మణ్, సకినాల జయమ్మ, వలందాస్ శోభ, నాయకులు భారత వాసుదేవ్ పాల్గొన్నారు.

ధాన్యం తడువకుండా జాగ్రత్త వహించాలి

● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్

పెద్దతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్

తుర్కపల్లి, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని, ధాన్యం తడువకుండా చర్యలు చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌సుందర్ ఆదేశించారు. తుర్కపల్లి మండలం పెద్దతండా గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, పంచాయతీ కార్యదర్శి స్వరూప, పీఏసీఎస్ సీసీ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

● ఎంపీడీఓ నిరంజన్‌వలీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నిరంజన్‌వలి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 19 : గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ నిరంజన్‌వలి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో రోజు 150 మంది కూలీలకు తగ్గకుండా పని కల్పించడంతో పాటు రోజుకు రూ.250 నుంచి 270 వేతనం వచ్చే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ పద్మావతి, ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి'


నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన ప్రజాశక్తి నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 19 : భువనగిరి గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తినడం వల్ల చిన్నలచ్చి ప్రశాంత్ మృతి చెందడం బాధాకరమని, విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో ఇలాంటి ఘటనలతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత లేనందునే, అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు వెంకటేశ్, కుక్క భిక్షపతి, సుక్క బాబు, బాలయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం

ప్లాస్టిక్ గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

చౌటుప్పల్, ఏప్రిల్ 19 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఓం సాయి ప్లాస్టిక్ గోదాంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ గోదాంలో అకస్మాత్తుగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడాన్ని గమనించిన నిర్వాహకులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. గోదాంలో ప్లాస్టిక్ వ్యర్థాలు భారీ స్థాయిలో నిల్వ ఉండటంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. దాంతో మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి తీవ్రంగా ప్రయత్నించారు. దాంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా ఫైరింజన్లు, స్థానిక వాటర్ ట్యాంకర్లను రప్పించారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరుగలేదు. ప్లాస్టిక్ గోదాం సమీపంలో రసాయన పరిశ్రమలు ఉండడంతో వారంతా ఆందోళన చెందారు. మంటలు అదుపులోకి రావడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఘటనా స్థలానికి పోలీస్, ఫైర్, రెవెన్యూ యంత్రాంగం చేరుకొని వివరాలను సేకరించారు.